
సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం ¦ 22 ¦ మే ¦ 2023



జల్లేరు.. అలరారు

దొరమామిడి సమీపంలో నిర్మించిన గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయానికి పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. 8లో ▸



పడిలేస్తున్న పౌల్ట్రీ

జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమ ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. గుడ్డు ధర నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో ▸



గిరిజనుల ఆప్యాయత మరువలేం

పశ్చిమ ఏజెన్సీలోని గిరిజనుల ఆప్యాయత, అనురాగాలను మరువలేమని రాష్ట్ర హస్త కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. 8లో ▸

పదింతల ప్రోత్సాహం

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బహుమతులు
- పదో తరగతిలో టాపర్లకు సన్మానాలు
- జిల్లాస్థాయిలో రూ.50 వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ.15 వేలు



పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే కార్పొరేట్ స్థాయిలో వసతులు, ఇంగ్లిష్ మీడియం చదువులు, నాడు–నేడులో పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద వంటి పథకాలు అమలు చేస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ సంస్థల విద్యార్థులకు దీటుగా రాణిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా సర్కారీ బడుల్లో చదివి టెన్త్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు వారిని సన్మానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా, నియోజకవర్గ స్థాయిలతో పాటు ఆయా యాజమాన్యాల వారీగా టాపర్లకు బహుమతులు అందించనున్నారు.

మొదటి మూడు స్థానాలకు..

జిల్లా విద్యాశాఖ అధికారులు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారి జాబితాలను సిద్ధం చేశారు. విద్యార్థులకు నగదు బహుమతితో పాటు పతకం, మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపికను అందించనున్నారు. అలాగే ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కూడా సత్కరిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను మరింత ప్రోత్సహించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ తరహా విధానాలు పిల్లల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకొస్తాయని, వారిలో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరుగుతుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అంటున్నారు.

నియోజకవర్గ స్థాయిలో..

జిల్లాలోని నియోజకవర్గాల వారీగా అత్యధిక మార్కులు సాధించిన మొదటి, రెండో, మూడో ర్యాంకర్లకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. ఈనెల 23న ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను సన్మానించనున్నారు.

జిల్లాస్థాయిలో.. ఈనెల 27న జిల్లాస్థాయిలో టాపర్లను సన్మానించనున్నారు. మొదటి ర్యాంకర్‌కు రూ.50 వేలు, రెండో ర్యాంకర్‌కు రూ.30 వేలు, మూడో ర్యాంకర్‌కు రూ.10 వేలు నగదు ప్రోత్సాహకం అందిస్తారు. అలాగే యాజమాన్యాల వారీగా టాపర్లకు కూడా ఇదే విధంగా నగదు బహుమతులు అందించనున్నారు. నియోజకవర్గ, జిల్లాస్థాయి కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ప్రభుత్వ అధికారులు పాల్గొంటారు.

రాష్ట్రస్థాయిలో.. రాష్ట్రస్థాయి టాపర్లను సీఎం జగన్ ఈనెల 31న సన్మానించనున్నారు. మొదటి ర్యాంకర్‌కు రూ.లక్ష, రెండో ర్యాంకర్‌కు రూ.75 వేలు, మూడో ర్యాంకర్‌కు రూ.50 వేలు అందిస్తారు.

పోటీతత్వం పెరుగుతుంది



ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం శుభపరిణామం. దీని వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం మరింత పెరుగుతుంది. రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో ర్యాంకులు సాధించాలనే తపన పెరుగుతుంది. దీంతో భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎక్కువ మంది ఉన్నత స్థానాలు అధిరోహించే అవకాశం కలుగుతుంది.

– ఎస్వీ రవిసాగర్, జిల్లా విద్యాశాఖాధికారి, ఏలూరు

జిల్లా టాపర్లు		
నియోజకవర్గం	విద్యార్థి పేరు	మార్కులు
తణుకు	ఎండీ సబీహ	586
భీమవరం	కె.కీర్తి శ్రీరంగ శివానీ	582
తాడేపల్లిగూడెం	జె.బలరామకృష్ణ	581
యాజమాన్యాల వారీగా..		
బీసీ వెల్ఫేర్	పెండ్యాల నవ్య శ్రీ	578
బీసీ వెల్ఫేర్	కోడే నాగేంద్ర రాజేష్	569
బీసీ వెల్ఫేర్	కొల్లాటి యజ్ఞ శ్రీ	564
సోషల్ వెల్ఫేర్	గెద్దల బాబి	557
సోషల్ వెల్ఫేర్	కె.కార్తీక్	556
సోషల్ వెల్ఫేర్	సీహెచ్ ప్రదీప్‌కుమార్	556
సోషల్ వెల్ఫేర్	ఐనపర్తి వెంకట్‌కుమార్	556
సోషల్ వెల్ఫేర్	వడాలి సురేష్‌కుమార్	553
సోషల్ వెల్ఫేర్	తిరుమాని బాలాజీ	553
నియోజకవర్గాల వారీగా..		
ఆచంట	గోవిందరాజు హరిత	567
ఆచంట	అండలూరి మహిమ	558
ఆచంట	టీవీవీఎస్ దుర్గాప్రదీప్	549
భీమవరం	కె.కీర్తి శ్రీరంగ శివాని	582
భీమవరం	టి.సాయి సత్య గీతిక	576
భీమవరం	ఆకుల నందిని	576
భీమవరం	వి.రమాదేవి	576
పాలకొల్లు	ఆర్.నేహా తరంగిణి	574
పాలకొల్లు	బాలి కిషోర్	571
పాలకొల్లు	కామన సత్యనారాయణ	569
తణుకు	ఎండీ సబీహ	586
తణుకు	నడపన దుర్గ	577
తణుకు	కారుమూరి గణ కార్తీక్	574
నరసాపురం	పెండ్యాల నవ్యశ్రీ	578
నరసాపురం	పోతాబత్తుల శ్రీనివాస్	576
నరసాపురం	వినుకొండ ఏడుకొండలు	572
తాడేపల్లిగూడెం	జె.బలరామకృష్ణ	581
తాడేపల్లిగూడెం	పండూరి గీతికశ్రీ	579
తాడేపల్లిగూడెం	కోరశిఖ దేవిక	578
ఉండి	అల్లు ఓం శ్రీసాయి స్వప్న	579
ఉండి	జి.దుర్గాదేవి ప్రసన్న	573
ఉండి	ఆకుల శ్రావణి	572
ఉండి	ముత్యం సౌజన్య మనోహరి	572

న్యూస్‌రీల్

ఆర్‌బీకేల ద్వారా మేలైన సేవలు



కొత్తూరులో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మేలైన సేవలందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని కొత్తూరు గ్రామంలో రూ.21.80 లక్షలతో ఆర్‌బీకే, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాల కోసం మండల కేంద్రాలకు వెళ్లనవసరం లేకుండా గ్రామస్థాయిలోనే ఆర్‌బీకేల ద్వారా అందుబాటులోకి తెచ్చారన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏఓ ఆర్‌ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మెరిసిన కృష్ణతేజ్



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యతో పాటు సాంకేతిక, పరిశోధన అంశాల్లో ప్రతిభ చూపుతున్న నగరానికి చెందిన విద్యార్థి వూసా చరణ్ నాగ కృష్ణతేజ్ మరోసారి మెరిశాడు. 2022లో ఇస్రో ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన యువ శాస్త్రవేత్తల అన్వేషణ కార్యక్రమం (యువిక-2022)లో రాష్ట్రం నుంచి ఎంపికైన ఐదుగురిలో ఒకడు కాగా.. ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో 581 మార్కులు సాధించి ఏలూరు నియోజకవర్గ టాపర్‌గా నిలిచాడు. ఇదిలా ఉండగా శనివారం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లోనూ 120 మార్కులకు 119 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 16వ స్థానంలో నిలిచాడు. ప్రభుత్వ జిల్లాపరిషత్ పాఠశాలలో చదువుతూ ప్రతిభ చూపుతున్న కృష్ణతేజ్‌ను పలువురు అభినందించారు.

ఏలూరు నాట్య అకాడమీ అ'ద్వితీయ'ం



బహుమతులు అందుకున్న చిన్నారులతో డైరెక్టర్ శాంతిశ్రీ

ఏలూరు(మెట్రో): భరతనాట్యంలో విశేష ప్రతిభ కనబర్చి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కేఎల్ యూనివర్సిటీ నటరాజ్ నాట్యాలయ నిర్వాహకుడు ఏలూరు విద్యార్థులను కొనియాడారు. శనివారం విజయవాడలో నటరాజ నాట్యాలయ 36వ సౌత్ ఇండియా ఆల్ స్టైల్స్, కూచిపూడి, భరతనాట్య పోటీలను నిర్వహించారు. ఏలూరు నాట్య అకాడమీ విద్యార్థినులు రెండో బహుమతి సాధించారు. ఏలూరు నాట్య అకాడమీ డైరెక్టర్ ఎస్.శాంతిశ్రీని నిర్వాహకులు నాట్య భగీరథ అవార్డుతో సన్మానించారు. విజేతలకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందించారు.

పోలీసులకు సమ్మర్ కిట్లు



పోలీస్ సిబ్బందికి సమ్మర్ కిట్లు అందిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: నగరంలోని డీఐజీ కార్యాలయం వద్ద ఆదివారం ఏలూరు జిల్లా ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి వేసవి సంరక్షణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు మండుటెండల్లోనూ విధులు నిర్వర్తిస్తూ ఉంటారని, ఎండ వేడి నుంచి సంరక్షణకు కిట్లు అందిస్తున్నామన్నారు. పోలీసు సిబ్బంది డీహైడ్రేషన్ బారిన పడకుండా నీటిని, ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలని సూచించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర కీలకమని, రోజంతా ఎండలో పనిచేయాల్సి ఉండటంతో ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. కిట్‌లో సమ్మర్ హ్యాట్స్, చలువ కళ్లద్దాలు, కూలింగ్ వాటర్ బాటిల్స్, ఓఆర్‌ఎస్‌ఎల్ ప్యాకెట్లు, రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి లైటింగ్ బ్యాటన్, రేడియం రిఫ్లెక్టింగ్ సేఫ్టీ జాకెట్స్ ఉన్నాయి. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏఆర్ డీఎస్పీ కృష్ణంరాజు, ఎస్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్, త్రీటౌన్ సీఐ వరప్రసాద్, వన్‌టౌన్ ఎస్‌ఐ రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్‌ఐ బుద్దల శ్రీనివాసరావు, శ్రీధర్, వెంకటేశ్వరరావు, నూజివీడు ట్రాఫిక్ ఎస్‌ఐ రాధాకృష్ణ రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

రోగులను డబ్బులు డిమాండ్ చేస్తే ఊరుకోం

మంత్రి కారుమూరి హెచ్చరిక



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ప్రభుత్వాసుపత్రికి వచ్చే పేద రోగులకు ఎటువంటి అసౌకర్యం కలిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం తణుకులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యవర్గాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య సిబ్బంది తమ విధి నిర్వహణలో భాగంగా ఆస్పత్రికి వచ్చే పేదరోగుల నుంచి డబ్బులు గుంజుతున్నారనే ఆరోపణ వచ్చిందని అన్నారు. దీనిపై ఆస్పత్రి అభివృద్ధి కమిటీతో చర్చించి విచారించగా సిబ్బంది కృష్ణ, శ్రీకాంత్, సుహాసిని, మోహన్ రోగుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు నిర్ధారణ అయ్యిందని, ఈ నలుగురిని తక్షణమే విధుల నుంచి తొలగించాల్సిందిగా వైద్యశాఖ అధికారులకు తెలిపానని వివరించారు. ఇకపై ఆస్పత్రిలో ఎవరైనా డబ్బులు అడిగితే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంతటి పెద్దస్థాయి వారిని అయినా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇకపై ఎటువంటి ఆరోపణలు వచ్చి రుజువైనా వారికి వేరే అవకాశం ఇవ్వకుండా ఇంటికి పంపిస్తామని అన్నారు. అవుట్ సోర్సింగ్ విభాగంలోని వారిపై ఎటువంటి ఆరోపణలు వచ్చినా వారి స్థానంలో కొత్తవారిని నియామకం చేస్తామని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, కమిటీ సభ్యులు కుడిపూడి చంద్రరావు, రేలంగి రాంబాబు, కొత్తపల్లి చరణ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినాన్ని పురస్కరించుకుని ఆదివారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రఘు మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితుల జీవన ప్రమాణం పెరిగేలా ప్రభుత్వం ఖరీదైన మందులు అందిస్తోందని, ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, బాధితులపై వివక్ష చూపరాదని సూచించారు. ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 28 మిలియన్ల మంది ఎయిడ్స్‌తో మృత్యువాత పడగా.. 42 మిలియన్ల మందికిపైగా బాధితులు మందులు వాడుతున్నారని చెప్పారు. అనంతరం తణుకు రాష్ట్రపతి రోడ్డులో ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్‌తో మృతిచెందిన వారికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సేఫ్ కేర్ సెంటర్ వైద్యాధికారి సుంకవల్లి రామకృష్ణ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రమేష్, డాక్టర్ రమేష్‌చంద్రబాబు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కరుణాకర చౌదరి, అభివృద్ధి కమిటీ సభ్యులు కుడిపూడి చంద్రరావు, రేలంగి రాంబాబు, కొత్తపల్లి చరణ్, సత్యసాయి సేవా సమితి సభ్యులు, సేఫ్‌కేర్ సెంటర్, ఐసీటీసీ, విహాన్, వైఆర్‌జీ కేర్, వీహెచ్‌ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం



పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఆకివీడు: రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. సిద్దాపురం గ్రామ శివారు నందమిల్లిపాడులో నాడు–నేడు పథకంలో రూ.44 లక్షల వ్యయంతో నిర్మించనున్న పాఠశాల భవన నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని, అధునాతన సౌకర్యాలను విద్యార్థులను అందుబాటులోకి తీసుకొస్తున్నారని అన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు యండగండి శ్రీను మాట్లాడుతూ విద్యారంగంలో నూతన మార్పులు మంచి ఫలితాన్ని ఇస్తున్నాయన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు, మండలపరిషత్ ఉపాధ్యక్షుడు కిల్లి రామకృష్ణ, ఉప సర్పంచ్ ఇందుకూరి నారాయణరాజు, జంపన సత్యనారాయణ రాజు, ఎస్.నాగరాజు, జగదీష్ పాల్గొన్నారు.

గుండుగొలను వంతెన నిర్మాణానికి శ్రీకారం

భీమడోలు: గుండుగొలను వంతెనను రెండు నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. వంతెన నిర్మాణానికి ఆదివారం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరితో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ గోదావరి ప్రధాన కాల్వపై శిథిలమైన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి సీఎం జగన్ చొరవతో కేంద్ర ప్రభుత్వం రూ.3.50 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. తక్కువ సమయంలో నిధులు మంజూరు చేయించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. వంతెన నిర్మాణంతో కొల్లేరువాసుల చిరకాల వాంఛ నెరవేరనుందని, రెండు నియోజకవర్గాల్లోని 15 గ్రామాల ప్రజలు, వి ద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. గతంలో వంతెన పాక్షికంగా కూలిన నేపథ్యంలో రూ.50 లక్షలతో బెయిలీ వంతెన నిర్మించి రాకపోకలను పునరుద్ధరించామన్నారు.

వైభవంగా శ్రీదేవీ శత చండీ యాగం



ఏలూరు విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పవర్‌పేటలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో త్రిశక్త్యాత్మిక శ్రీదేవీ శత చండీ యాగ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం మహాలింగార్చన, శ్రీచక్రార్చన, సూర్యనమస్కారాలు, చండీ సప్తశతి పారాయణలు, చండీ హోమం, సూర్యారాధన పూజలు చేశారు. 108 శక్తి పీఠాల్లోని అమ్మవార్ల పేర్లతో 108 మంది ముత్తయిదువులకు తాంబూలాలు, వాయనాలు సమర్పించారు. సాయంత్రం ప్రదోషకాల పూజ, యాగశాల బలి, గ్రామ దేవతల ఊరేగింపు నిర్వహించారు. రాత్రి గంగా, కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు కందుకూరి రామ బ్రహ్మానంద శర్మ విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి ఎం.రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అట్టహాసంగా దెందులూరు ఏఎంసీ ప్రమాణ స్వీకారం



పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి: మండలంలోని లక్ష్మీపురం మార్కెట్ యార్డులో దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఏఎంసీ చైర్మన్‌గా అప్పన కనక దుర్గాప్రసాద్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గాన్ని రూ.2,200 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమానికి రూ.1.50 లక్షల కోట్లు అందించారన్నారు. వ్యవసాయం దండగ అని చంద్రబాబు రైతులను నిరుత్సాహపరిస్తే.. సీఎం జగన్ వ్యవసాయాన్ని పండగ చేశారన్నారు. అన్నదాతల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే దెందులూరును వైఎస్సార్ సీపీ అడ్డాగా మార్చామని, ఇదే ఒరవడి కొనసాగిస్తామన్నారు. అప్పనప్రసాద్ సారథ్యంలో దెందులూరు మార్కెట్ కమిటీ అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు అందించే దిశగా నూతన పాలకవర్గం కృషిచేస్తుందన్నారు. దెందులూరు గడ్డ 2024 ఎన్నికల్లోనూ కొఠారు అడ్డాగా మారి ఫ్యాన్ గాలి వీస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ఏఎంసీ ఆర్మీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అతిథులు, ప్రముఖులు మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

పాలకవర్గం ఇలా..

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సారథ్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అప్పన కనకదుర్గాప్రసాద్, వైస్ చైర్మన్‌గా కాటి సుధాకర్, సభ్యులుగా కంభంపాటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొసరాజు రత్నకుమారి, దేవల రాజశేఖరరావు, నాగులపల్లి రంగారావు, పామర్తి నాగజ్యోతి, తోట హేమలత, బోడవరపు నళినికుమారి, పులిపాటి శ్యామలాదేవి, కొండే జోజిలత, ఆవాల లీలావతి, కట్నేని తులసిరామ్, పసుపులేటి రాజేష్, పెదపాడు కో–ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, గోపన్నపాలెం సర్పంచ్‌ను నూతన పాలకవర్గంగా నియమించారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి వ్యవహరిస్తారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, తలారి వెంకటరావు, తెల్లం బాలరాజు, వీఆర్ ఎలీజా, ఎమ్మెల్సీలు జయ మంగళ వెంకటరమణ, వంక రవీంద్రనాథ్, ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు యుడీఏ చైర్మన్ మధ్యాహ్నపు ఈశ్వరి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, దెందులూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, బీసీ నేత ఘంటా ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ రైతు సంఘ నేత ఆళ్ల సతీష్‌చౌదరి, సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



భక్తులతో రద్దీగా ఉన్న గుబ్బల మంగమ్మ గుడి ప్రాంతం

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం అటవీప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మతల్లి గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు లారీలు, మినీవ్యాన్‌లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లలో తరలివచ్చి మంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

జస్టిస్ శేషసాయికి అభినందనలు



జస్టిస్ ఆకుల వెంకట శేషసాయికి అభినందనలు తెలియజేస్తున్న న్యాయవాదులు

సాక్షి, భీమవరం: ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి నియమితులైన సందర్భంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో అభినందనలు తెలియజేశారు. ఆదివారం భీమవరంలోని ఆయన నివాసానికి వెళ్లి న్యాయవాదులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ భీమవరానికి చెందిన న్యాయమూర్తి ఆకుల శేషసాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులవడం గొప్ప విషయమన్నారు. న్యాయమూర్తిగా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైవీ ఆనంద్, మల్లుల శ్రీను, గెద్దాడ సూర్యనారాయణ, డాక్టర్ కె.రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

పడిలేస్తున్న పౌల్ట్రీ

- నిలకడ లేని గుడ్డు ధర.. వేసవిలో తగ్గిన ఉత్పత్తి
- కరోనా వేళ రూ.2.25కు కనిష్టానికి పతనమైన ధర
- ఏడాదిగా నెక్ ధర రూ.5, ఇటీవల రూ.6, ప్రస్తుతం రూ.4.84
- పొరుగు రాష్ట్రాలకూ మందగించిన ఎగుమతులు

తణుకు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమ ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ప్రస్తుతం గుడ్డు ధర నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాదిగా గుడ్డు నెక్ ధర రూ.5 ఉండగా, ఇటీవల వరకు రూ.6, ప్రస్తుతం రూ.4.84 పలుకుతోంది. వేసవి కారణంగా గుడ్డు ఉత్పత్తి తగ్గగా ఎగుమతులు కూడా మందగించాయి. మూడేళ్ల క్రితం కరోనా కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ కుదేలైంది. అప్పట్లో చికెన్, గుడ్డు వినియోగం తగ్గిన నేపథ్యంలో ఒక్కసారిగా పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. అప్పట్లో చికెన్ ధర తగ్గగా, గుడ్డు ధర సైతం గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.2.25కు పతనమైంది. అయితే కరోనా కట్టడిలో పౌష్టికాహారం అయిన కోడిగుడ్లు, చికెన్ ప్రాధాన్యత పెరగడంతోపాటు ప్రభుత్వం, వైద్యులు సైతం అవగాహన పెంచడంతో పౌల్ట్రీకు కలిసి వచ్చింది. రెండేళ్లుగా గుడ్డు, చికెన్ వినియోగం పెరగడంతో వాటి ధరలు సైతం గణనీయంగా పెరుగుతూ వచ్చాయి. ఈ పరిస్థితుల్లో ఏడాది కాలంగా కోడిగుడ్డు నెక్ ధర రూ.5 పైగా పలుకుతూ వస్తోంది. ఇటీవల బహిరంగ మార్కెట్‌లో రూ.6 పలికింది. ప్రస్తుతం నెక్ ధర రూ.4.84 వద్ద కొనసాగుతోంది.

ఇప్పుడిప్పుడే కోలుకునే దిశగా..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 250 వరకు పౌల్ట్రీలు ఉండగా వీటిల్లో సుమారు 1.20 కోట్ల కోళ్లు పెరుగుతున్నాయి. వీటి ద్వారా నిత్యం కోటి గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. సాధారణ రోజుల్లో 80 శాతం మేర కోడిగుడ్లు పొరుగు రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, ఒడిశా, అసోం, బీహార్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. మిగిలిన 20 శాతం స్థానికంగా వినియోగిస్తుంటారు. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో మూడేళ్లగా రైతులు పెద్ద సంఖ్యలో కోళ్ల వదిలించుకుని చేతులు దులుపుకున్నారు. తర్వాత బ్యాచ్‌లు వేయకపోవడంతో దాదాపు సగం మేర కోళ్ల ఫారాలు ఖాళీ అయ్యాయి. దీంతో కోడిగుడ్ల ఉత్పత్తి సైతం సగానికి పైగా పడిపోయింది. ఈ పరిస్థితుల్లో 2020 మార్చిలో గుడ్డు ధర రూ. 2.25 కనిష్ట స్థాయికి దిగజారింది. తదనంతరం ధర పెరిగినప్పటికీ నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్కో గుడ్డు ఉత్పత్తి ధర రూ.3.75 అవుతోంది. అయితే రెండేళ్లుగా సరైన ధర లేక పౌల్ట్రీకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. ఆందోళన చెందిన రైతులు కోళ్లఫారాలు ఖాళీ చేశారు.



తణుకు శివారులోని ఓ కోళ్లఫామ్

ఇప్పుడిప్పుడే పౌల్ట్రీ పరిశ్రమ కోలుకోవడంతో ఉత్పత్తి పెరిగింది. మరోవైపు నెక్ ప్రకటించిన ధరకు రైతుల వద్ద కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు.

తగ్గిన ఎగుమతులు

వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా ఉన్న పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకునే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన కృషితో పౌల్ట్రీ పరిశ్రమ మరోసారి నిలదొక్కుకుంది. కోవిడ్ కారణంగా సంక్షోభంలోకి వెళ్లిన పౌల్ట్రీ పరిశ్రమను గట్టెక్కించేందుకు పౌల్ట్రీ అసోసియేషన్‌తో కలిసి గతంలో చికెన్, ఎగ్ మేళాలు నిర్వహించారు. ప్రస్తుత వేసవి కాలంలో గుడ్డు ఉత్పత్తి తగ్గుతుండగా ఎగుమతులు సైతం ఆశించిన స్థాయిలో లేవు. ప్రస్తుతం బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో వినియోగం తగ్గింది. ఎండలు పెరుగడంతో కోళ్ల మేతతో పోల్చితే నీళ్ల ఎక్కువగా తీసుకోవడం ద్వారా గుడ్డు పెంకు పటిష్టత తగ్గుతుంది. దీంతో గడ్డు నాణ్యత తగ్గి ఎగుమతులకు ఇబ్బందులు ఎదురవుతోందని రైతులు చెబుతున్నారు. ఇదే వంకతో పొరుగు రాష్ట్రాల్లో వ్యాపారులు గుడ్డు ధరను తగ్గిస్తున్నారని వాపోతున్నారు.

ధర నిలకడగా లేదు



మూడేళ్ల క్రితం కోవిడ్ కారణంగా కోళ్ల పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోయింది. అయితే ఇటీవలి కాలంలో గుడ్డు వినియోగం పెరగడంతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాం. గడ్డు ధర నిలకడగా ఉంటే నష్టాల నుంచి గట్టెక్కుతాం. వేసవి కారణంగా గుడ్డు ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరిగింది.

– పెన్మత్స సుబ్బరాజు, పౌల్ట్రీ రైతు, కావలిపురం, ఇరగవరం మండలం

కిటకిటలాడిన బీచ్



కేపీ పాలెం బీచ్‌కు తరలివచ్చిన పర్యాటకులు

మొగల్తూరు: కేపీపాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. పర్యాటకుల రాకతో బీచ్ రోడ్డు కిటకిటలాడింది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటంతో సముద్రస్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని వెంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత, పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పాలకొల్లు అర్బన్: హైవేలో నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పాలకొల్లు – భీమవరం హైవేలో దగ్గులూరు వద్ద శిద్ధాని గణేశుల మల్లయ్య (73) ఆదివారం నడిచి వెళుతున్నాడు. ఆ సమయంలో పాలకొల్లు నుంచి భీమవరం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లయ్య ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాలకొల్లు తరలించారు. మృతుడి భార్య దానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ సీహెచ్ నారాయణమూర్తి చెప్పారు.

ఆలయాలను దర్శించిన జస్టిస్ శేషసాయి

నరసాపురం రూరల్: ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ఆదివారం నరసాపురంలోని పలు ఆలయాలను సందర్శించారు. తొలుత వలంధర్ రేవులో చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆయనకు సాదర స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పవిత్ర వశిష్టానదిలో పుణ్యస్నానమాచరించి అక్కడి నుంచి కపిల మల్లేశ్వరస్వామివారి ఆలయానికి చేరుకున్న ఆయనను ఆలయ చైర్మన్, న్యాయవాది వెన్నా ప్రకాష్ ఆలయ మర్యాదలతో వేదమంత్రోచ్ఛారణల మధ్య పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్, గోపాలకృష్ణలు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాతబజారు ప్రాంతంలో వేంచేసిన ఉన్న వరాల వెంకటేశ్వరస్వామి, మెయిన్‌రోడ్డులోని కోదండ రామాలయాలలో కూడా జస్టిష్ శేషసాయి దంపతులకు సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన శేషసాయిని పలువురు న్యాయవాదులు కలసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వారి వెంట న్యాయవాదులు జీవీకే రామారావు, కానూరి స్వామినాయుడు, పోలిశెట్టి బాబ్జి, కామన బుజ్జి, పోలిశెట్టి సూరిబాబు, దానయ్యనాయుడు, చేగొండి బాలాజీ, కానూరి బుజ్జి, సరిపల్లి రామసత్తియ్య, రమణ, పూరిళ్ల శ్రీను, కొప్పినీడి పద్మజ, కురెళ్ల అన్నపూర్ణ, వైడీఎస్ ఫణి ఉన్నారు.



జస్టిస్ శేషసాయికి స్వాగతం పలుకుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

అడవి బిడ్డల ఆప్యాయత మరువలేనిది

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లోని అడవిబిడ్డల ఆప్యాయత అనురాగాలు మనస్సును కట్టిపడేశాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని కేఆర్‌పురంలో ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తాను మూడురోజుల పాటు గిరిజన మండలాల్లో పర్యటించిన వివరాలను తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో హస్తకళాకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో వెదురు ద్వారా తయారు చేస్తున్న కళాకృతులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో వైఎస్సార్ హస్తకళల బజార్ (హ్యాండ్ క్రాఫ్టింగ్ బజార్) ఏర్పాటు చేసేవిధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. గత మూడురోజులుగా బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు మండలాల్లోని మారుమూల అటవీప్రాంతాల్లో గల గ్రామాల్లో పర్యటించి అక్కడ గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల అమలుతీరుపై కూడా ఆరా తీశామని చెప్పారు. అటవీ ప్రాంతంలోని మారుమూల గ్రామంలో ఉన్న గిరిజనులకు అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, చేదోడు, ఆసరా వంటి పథకాలు నేరుగా తమకు అందుతున్నాయని గిరిజనులు తెలిపారని చెప్పారు. అలాగే బుట్టాయగూడెం మండలంలో పర్యటించిన సందర్భంగా తేనె తయారీ, అగరుబత్తీ తయారీ, వివిధ వెదురుతో వివిధ రకాల గృహాలంకరణ వస్తువుల తయారీకి శిక్షణ ఇప్పించే విధంగా కృషి చేస్తామన్నారు. అలాగే వేలేరుపాడు మండలంలోని గోదావరి నదిపై లాంచీ ప్రయాణం తమకెంతో అనుభూతిని కలిగించాయని అన్నారు. ఈ సందర్భంగా లాంచీ ఏర్పాటు చేసిన తహసీల్దార్ కె.చల్లన్నదొరకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ నాయకులు బడిగించల చంద్రమౌళి, విజయవాడ నగర పాలక సంస్థ కార్పొరేటర్ ఉద్దంటి సురేష్ మాట్లాడుతూ తమ పర్యటనలో గిరిజనులు చూపించిన అనురాగ ఆప్యాయతలను మరచిపోలేమని అన్నారు. ఈ సందర్భంగా సామాజికవేత్త కట్టా లక్ష్మి, వైటీసీ మేనేజర్ ఇజ్రాయేలు రాజు, ఆయా మండలాల్లోని సర్పంచ్‌లు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



పులిరామన్నగూడెంలో గిరిజనులతో మాట్లాడుతున్న విజయలక్ష్మి

● గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్: కొత్తూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు (టూటౌన్): ఏపీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎస్ఆర్‌పీ విఠల్ కుమార్ ఎన్నికయ్యారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం అసోసియేషన్ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులు అంపావతి గోవింద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈమేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన ఆదివారం సాయంత్రం ఏలూరులో తెలియజేశారు. ఈ సందర్భంగా విఠల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. విజయవాడలో జరిగిన సమావేశంలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి విచ్చేసిన అధ్యక్ష, కార్యదర్శులు తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నుకోవడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విఠల్ కుమార్‌ను పలువురు బీసీ ఉద్యోగుల సంఘాల నాయకులు, బీసీ ముఖ్య నాయకులు అభినందించారు.



మాట్లాడుతున్న ఎస్‌పీఆర్ విఠల్ కుమార్

శ్రీవారి సేవలో వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్



వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్‌కు శ్రీవారి మెమెంటో అందిస్తున్న ఆలయ ఏఈఓ రాజు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ నివాస్ ఆదివారం రాత్రి సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనం పలికారు. ఆ తర్వాత ఆలయ ఏఈఓ కేఎల్ఎస్ రాజు ఆయనకు శ్రీవారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

రుగ్వేద పరీక్షల్లో వేద విద్యార్థుల ప్రతిభ



లోకా బాలభద్ర ఎస్.దుబే ఎస్.రోహిత్ శర్మ

ఆగిరిపల్లి: స్థానిక శోభనాద్రి లక్ష్మీనృసింహ వేదశాస్త్ర పాఠశాలకు చెందిన ముగ్గురు వేద విద్యార్థులు మైసూర్ అవధూత దత్తపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఋగ్వేద మూలం పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కార్యదర్శి సూరి శర్మ ఆదివారం చెప్పారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరిగిన ఋగ్వేద పరీక్షల్లో వేద పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు హాజరవ్వగా, వారిలో ఉత్తమ శ్రేణిలో లోకా బాలభద్ర ఉత్తీర్ణత సాధించగా, మధ్యప్రదేశ్‌కు చెందిన యశ్ దుబే ప్రథమ శ్రేణి, కాకినాడకు చెందిన సాలగ్రామ రోహిత్ శర్మ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వీరికి మైసూర్ దత్త పీఠం ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలు అందించారన్నారు. వేద విద్యార్థులకు ఉత్తమంగా విద్యను బోధించిన మహేంద్రవాడ సాయి సుబ్రమణ్య శ్రీతేజ శర్మను, పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కార్యదర్శి శర్మ అభినందించారు.

ఆహ్లాదకరం.. జల్లేరు జలాశయం

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడి సమీపంలో నిర్మించిన గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయానికి పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొండల మధ్య ఆహ్లాదకరమైన ప్రదేశంలో నిర్మించిన ఈ జలాశయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా జల్లేరు జలాశయంలో పర్యాటకుల కోసం సుమారు రూ. 20 లక్షల వ్యయంతో రిసార్ట్స్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో నిర్మించిన ఈ జల్లేరు జలాశయం చుట్టూ కొండల మధ్య వరదనీటితో ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తూ పర్యాటకుల మనస్సు దోచుకుంటాయి. ప్రస్తుతం జలాశయంలో నీరు తగ్గిపోవడంతో ఇక్కడికి వచ్చిన పర్యాటకులు జలాశయాల్లో ఈత కొడుతూ సందడి చేస్తున్నారు. గుబ్బల మంగమ్మగుడిని దర్శించిన భక్తులు ప్రతి ఆదివారం, మంగళవారం తప్పనిసరిగా ఈ జలాశయాన్ని కూడా సందర్శిస్తుంటారు. పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని మరింత తీర్చిదిద్దితే గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది.



జల్లేరు జలాశయం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ఆగిరిపల్లి: వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్.చంటిబాబు ఆదివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వడ్లమానుకు చెందిన ఓ వివాహిత తన భర్త ఆరు నెలల క్రితం మృతి చెందడంతో కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. పనుల కోసం ఈదులగూడెంకు వెళ్లిన సందర్భంలో దండిబోయిన కాసులు అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. అప్పటి నుంచి వివాహితకు కాసులు ఫోన్ చేసి తన కోరిక తీర్చమని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో 14న కాసులు వివాహిత ఇంటికి వెళ్లి చెయ్యి పట్టుకుని తన కోర్కె తీర్చాలంటూ అసభ్యంగా ప్రవర్తించి మాట వినకపోతే చంపుతానని బెదిరించాడు. పెద్దల వద్ద పెట్టగా సమస్య పరిష్కారం కాక వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహితపై దాడి ఘటనలో కేసు నమోదు

సీతారామపురంలో మహిళపై దాడి ఘటనలో ఆకిరెడ్డి శ్రీనివాసరావుపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంటిబాబు తెలిపారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మ దేవస్థానానికి విరాళం అందజేత



ముత్యాలంబపురంలోని ముత్యాలమ్మవారి వెండి చీరకు విరాళం అందజేస్తున్న దాతలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ముత్యాలమ్మవారి దేవస్థానానికి ఆదివారం పెదతాడేపల్లికి చెందిన జూటూరు గురుసాగర్ - మాలతీ లక్ష్మీశ్రీ సౌజన్య దంపతులు రూ.12,116 విరాళంగా అందజేశారు. అమ్మవారికి వెండి చీర తయారీ నిమిత్తం ఈ మొత్తాన్ని అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.హరేరామ్‌ప్రసాద్ సత్కరించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన మంత్రి కారుమూరి



తణుకులో డాక్టర్ అచ్యుతరామయ్యను పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదివారం పలువురిని పరామర్శించారు. పట్టణానికి చెందిన డాక్టర్ అచ్యుతరామయ్య తండ్రి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన గుత్తులసూర్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మంత్రి కారుమూరి పరామర్శించారు. పట్టణానికి చెందిన శ్రీనివాసరెడ్డి సతీమణి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న నేపథ్యంలో మంత్రి కారుమూరి వారి ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

సాక్షి, భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం ప్రపంచ సాంస్కృతిక దినోత్సవం, జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది దాశరథి శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ జాతి ప్రగతికి సంస్కృతికి నిలువుటద్దంలా నిలుస్తుంది అన్నారు.విభిన్న మతాలు, కులాలు, భాషలు, జీవన విధానాలు, కట్టు, బొట్టు, ఆహార వ్యవహారాలతో కూడిన భిన్నత్వంలో ఏకత్వం ప్రదర్శిస్తున్న భారతీయ సంస్కృతి మహోన్నతమైందని తెలిపారు. ప్రతీరోజు ప్రపంచ విషయాలపై అవగాహన, సంబంధిత అంశాలపై బాలల సందేహాలను నివృత్తి చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

మహిళలకు కుట్టు శిక్షణ శిబిరం

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవునిచిక్కాల శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల అనంత రామారావు తెలిపారు. ట్రస్ట్ భవనంలో జూన్ మొదటి వారంలో ప్రారంభం కానున్న ఈ శిక్షణకు 18 ఏళ్ల నిండి 50 ఏళ్ల లోపు మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ట్రస్ట్ భవనంలో మహిళలకు రెండు నెలలు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన మహిళలకు స్కిల్ డవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా వారి ద్వారా సర్టిఫికెట్ అందిస్తారన్నారు. అలాగే శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.8 వేలు విలువైన టేబుల్, మోటార్‌తో పాటు కుట్టు మిషన్ ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యార్థులకు సత్కారం

ఉండి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉండి జెడ్పీ హైస్కూల్లో సోమవారం అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం బేబీ తెలిపారు. ఉదయం 9 గంటల నిర్వహించే ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఆమె తెలిపారు. అలాగే ఉండి జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులంతా మీ పిల్లలను చేర్పించాలంటూ హెచ్ఎం కోరారు.

దాతల సాయం అభినందనీయం

భీమవరం (ప్రకాశంచౌక్): హెచ్ఐవీ బాధితులకు దాతల సాయం అభినందనీయమని ఏఆర్‌టీ సెంటర్ వైద్యుడు డాక్టర్ గోవిందబాబు అన్నారు. పాజిటివ్ పీపుల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో హెచ్ఐవీతో చనిపోయిన వారి జ్ఞాపకార్థం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం దాతల సాయంతో హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కముజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- తాడేపల్లిగూడెం మండలం కొత్తూరులో గడపగడపకు..



కొత్తూరులో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: తాను అధికారంలోకి వస్తే ప్రజల్ని కోటీశ్వరులని చేస్తానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, మరోసారి ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం కొత్తూరు అరుంధతీ పేటలో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ప్రజల ఆనందాన్ని దూరం చేయడానికి చంద్రబాబు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ వైవీ.వెంకట్రావు, పంచాయతీ ఈవోలు కె.శ్రీనివాస రెడ్డి, సీహెచ్. శ్రీనివాస చంద్రరాజు, పంచాయతీ కార్యదర్శి ఉప్పు విజయలక్ష్మి, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, ఎంపీటీసీలు నార్ని శంకరవవు, మార్లపూడి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, దేవతల విజాజీ, గంగాధర్, శ్రీను, గజ్జరపు రామకృష్ణ, తిరుమల శ్రీనివాస్, బాదం సూర్యచంద్రరావు, సూర్యనారాయణ, కూడవల్లి నరసింహమూర్తి, సత్యనారాయణ, గోపిశెట్టి సుబ్బారావు, తిరుమళ్ళ నగేష్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలి



గట్టిం మాణిక్యాలరావును అభినందిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తాడేపల్లిగూడెం (టీటౌన్): లయన్స్ క్లబ్ జిల్లా శాఖను మరింతగా విస్తరించి, పేద ప్రజలకు సేవలు విస్తృతంగా అందించాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. జిల్లా నూతన గవర్నర్ గట్టిం మాణిక్యాలరావును ఆదివారం తాడేపల్లిగూడెంలో రవీంద్రనాథ్ కలిశారు. ఆయన మాట్లాడుతూ యువతను లయనిజం వైపు మరలించి సేవా కార్యక్రమాలలో భాగం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వట్టిప్రోలు రాము, పాండురంగారావు పాల్గొన్నారు.

సమాజ సేవలు స్ఫూర్తిదాయకం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీటౌన్): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమాజ సేవలు స్ఫూర్తిదాయకమని చార్టెడ్ అకౌంటెంట్ (సీఏ) చిన్నం మనీంద్ర అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో దాత పదమ్ కుమార్ గుప్తా సహకారంతో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ నేత్ర వైద్యశాల వారితో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 62 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచిత కంటి ఆపరేషన్ చేసేందుకు 10 మందిని నిడదవోలు ఆసుపత్రికి పంపారు. అవసరమైన 20 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందించేందుకు నిర్ణయించారు. కోశాధికారి చిన్నం జగదీష్, పేరూరి కాశయ్య, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, మదన్‌మోహన్ అగర్వాల్, జీడిగుంట హరిబాబు, ఆంజనేయస్వామి, అడ్డు రంజిత్ పర్యవేక్షించారు.

అట్టహాసంగా గంగానమ్మ జాతర ప్రారంభం



ఆకట్టుకున్న వివిధ విచిత్ర వేషధారణలు

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దాదాపు నాలుగున్నర దశాబ్దాల అనంతరం జాతర నిర్వహిస్తుండడంతో గ్రామస్తులు వేలాదిగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలను ప్రారంభించగా గ్రామ నలువైపులా పొలిమేర తోరణాలు కట్టారు. మతాలకు అతీతంగా గ్రామస్తులు తరలివచ్చి గంగానమ్మ శరణు ఘోషతో తోరణాలరాటల్ని నిలబెట్టారు. తాడేపల్లిగూడెం, కొయ్యలగూడెం, ఎర్రంపేట, యర్నగూడెం రోడ్లలో తోరణాలను కట్టిన పిదప అమ్మవారిని సాదరంగా పుట్టింటికి పుట్టింటి ఆడపడుచులు ఆలయానికి (పుట్టిల్లు) తోడ్కొని వచ్చారు. నిర్విరామంగా రెండు గంటల పాటు బాణసంచా పేలుళ్లతో అమ్మవారి శరణు ఘోషతో మెయిన్ సెంటర్ మార్మోగింది. సాయంత్రం నుంచి జబర్దస్త్ నటీనటులు చిత్రం శ్రీను, విజయ్, చిట్టిబాబు, మురళి, స్రవంతి తదితరులు వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిరోజు జబర్దస్త్ బుల్లితెర నటులతో కామెడీ షోలు, అదే విధంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 31వ తేదీన హైపర్ ఆది కామెడీ షోలో పాల్గొననున్నట్లు సర్పంచ్ పసుపులేటి రాంబాబు తెలిపారు.

రాజీవ్‌గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



బుట్టాయగూడెంలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సేవ కేంద్రం ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రగళ్లపాటి కాశీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌత సత్యేంద్ర పాల్గొని మాట్లాడారు. రాజీవ్ గాంధీ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆనాడు దేశ ప్రధానిగా భారతదేశాన్ని కమ్యూనికేషన్ రంగంలో ముందుకు నడిపించి టెక్నాలజీ, డిజిటలైజేషన్‌కు కారణమయ్యారన్నారు. అంతేకాకుండా పంచాయతీ మున్సిపాలిటీలకు కేంద్ర నిధులు డైరెక్టుగా వెళ్లే విధంగా చట్టం చేసి స్థానిక సంస్థలను బలోపేతం చేసిన నాయకుడు అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరవల్లి సోమేశ్వరరావు, మామిడి రాము, తాడేపల్లి ఉమాదేవి, కుమారి, మొగిలినీడి శ్యామ్, గోపిశెట్టి ప్రసాద్, జ్ఞానే, రామసూరి రెడ్డి, వసంతాటి మంగరాజు, కసింకోట సతీష్, బుడుపుల ప్రసాద్, లంకలపల్లి శ్రీను, బోను దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పైదా పోతురాజు, చిడిపి కుటుంబ రావు, అర్జునరావు, భీమరాజు, బాపిరాజు, కుంజా భీమరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీఫ్ జస్టిస్ శేషసాయికి సత్కారం



హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆకుల శేష సాయికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ఏపీ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ గా నియమితులైన ఆకుల శేష సాయిని ఆదివారం భీమవరంలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమవరం అనే పదంలోనే వరం ఉందని, జిల్లాల పునర్విభజన లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా నూతనంగా ఏర్పడడం, ఈ జిల్లాకు భీమవరం కేంద్రం కావడం ఒక వరమైతే, భీమవరానికి చెందిన ఆకుల శేష సాయి హైకోర్టు చీఫ్ జస్టిస్ గా నియమితులు కావడం భీమవరం ప్రజలకే కాకుండా పశ్చిమగోదావరి జిల్లాకే ఖ్యాతి దక్కిందని శ్రీనివాస్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆకుల శేషసాయి మరింత ఉన్నత శిఖరాలను కచ్చితంగా అధిరోహిస్తారని ఇందులో ఎలాంటి సందేహము లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సాక్షి, భీమవరం: పట్టణంలోని గొల్లవానితిప్ప రోడ్ లో కొత్తగా 33 కెవి లైన్లు ఏర్పాటు నిమిత్తము 22వ తేది ఉదయం7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రామలక్ష్మి నగర్, ప్రకాష్ నగర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా తణుకు మహిళా గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, వేసవి శిక్షణ శిబిరంలో ఆటపాటలలో పాల్గొన్న విద్యార్థులు

తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం తణుకు బ్యాంక్ కాలనీలోని పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, విద్యార్థులతో కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పలు అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ పాల్గొన్నారు. శనివారం తణుకు రూరల్ మండలం వేల్పూరులోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదివించడం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు పాల్గొన్నారు.

ఉల్లాసంగా గ్రంథాలయ వేసవి శిక్షణ

తాడేపల్లిగూడెం (టీటౌన్): పట్టణంలో గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఉల్లాసంగా వివిధ ఆట పాటలతో విద్యార్థులు పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన ఈ శిబిరంలో విశ్రాంత ఉద్యోగులు ప్రత్తి వీరాస్వామి తెలుగు, ఆటలు, ఎస్.సాల్మన్‌రాజు పోషకాహారం, విటమిన్ల ఆవశ్యకతను వివరించారు. మహాశివభట్టు లక్ష్మణరాజు, ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగి గరికిపాటి బాపయ్య శర్మ వివిధ అంశాలను బోధించారు. పిల్లలకు మిఠాయిలు పంచారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్ : తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ఆదివారం 9 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యుడు సుంకవల్లి రామకృష్ణ సంచార వైద్యశాల ద్వారా తణుకు, పాతూరు, కే సావరం గ్రామాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సంఘ సభ్యులు బొప్పె సత్యలింగం ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

31 మంది ఉచిత వైద్య పరీక్షలు

ప్రతీ నెలా మూడు ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీలోని సంఘ కార్యాలయంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో 31 మంది ఉచిత సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘ సభ్యులు పీ సత్యనారాయణ, సాయి శ్వేత డయాగ్నస్టిక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

దాతలూ..బాలుడిని ఆదుకోరూ..

భీమవరం అర్బన్: మండలంలోని కోమటితిప్ప గ్రామంలో ఇరుసుమండ సతీష్ కుమార్ (6) మెదడు నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి వల్ల సతీష్ కుమార్ మంచంపైనే అచేతనంగా ఉండటంతో తల్లిదండ్రులు ఇరుసుమండ ఆనందరావు, రూతమ్మలు తమ కుమారిడిని ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు. కూలి పనులు చేసుకుని వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని నెట్టికొస్తున్న ఆనందరావు తమ కుమారుడు సతీష్ కుమార్ కోసం ఇప్పటి వరకు స్థోమతకు మించి రూ. 10 లక్షలు వరకు ఖర్చు చేశాడు. వైద్యం కోసం విజయవాడలోని రెండు ప్రైవేటు ఆస్పత్రులలో వైద్యం చేయిస్తున్నామని నెలకు రూ.6 వేలు వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఈ వ్యాధి నయం అవ్వాలంటే రూ. 10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతున్నారని అంత స్థోమత మాకు లేదని దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

విజ్ఞానార్జనే లక్ష్యంగా కృషి చేయాలి



విద్యార్థినికి ప్రసంశాపత్రం, మెమొంటో, నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న మానవత సభ్యులు

తణుకు టౌన్: విద్యార్థులకు పదో తరగతి ఉత్తీర్ణతే కీలకమని, అనంతరం ఎంచుకునే కోర్సులే భవిష్యత్‌ను నిర్ణయిస్తాయని ప్రముఖ వైద్యులు వీ భువనశ్రీ చెప్పారు. ఆదివారం తణుకు మానవత సంస్థల ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానం కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తణుకు మానవత సంస్థల అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మానవత సంస్థ రాష్ట్రర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధాపుష్పావతి మాట్లాడుతూ విద్యార్థులు మార్కుల కన్నా విజ్ఞానాన్ని సంపాదించడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణం, మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు రూ. 10 వేలు, 9 వేలు చొప్పున నగదు పారితోషికం, ప్రసంశా పత్రాల సత్కరించారు. డాక్టర్ భువన శ్రీ ఒక్కొక్కరికి రూ. 2 వేలు నగదు పారితోషికాన్ని అందజేశారు. మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, జిల్లా సహాయ కార్యదర్శి బీ రామలక్ష్మీ, ఏ బాలాజీ, కన్వీనర్ ఎస్‌వీ సతీష్ బాబు పాల్గొన్నారు.

మోగల్లులో ఘనంగా స్త్రీల సండే



మోగల్లులో నిర్వహించిన స్త్రీల సండేలో భక్తి గీతాలు ఆలపిస్తున్న విశ్వాసులు

పాలకోడేరు: మోగల్లు సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో ఆదివారం స్త్రీల సండే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆరాధన, పాటలు, వాక్యము చదువుట, ప్రత్యేక ప్రార్థనలు, వాక్య సందేశం, ముగింపు ప్రార్థనలు, కానుకలు పట్టుట అన్ని కార్యక్రమాలు స్త్రీలే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపే జయ పాల్గొని ప్రారంభించి వాక్య సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బైబిల్ గ్రంథంలోని రూతు, ఎస్తేరు, హన్నా దేవుని మార్గంలో నడిచి దేవుని దీవెనలు పొందారని వారి జీవిత చరిత్రను వివరించారు. స్త్రీలు భర్తకు లోబడి జీవించాలని అన్నారు. స్త్రీలంతా క్రీస్తు మార్గంలో నడవాలని ప్రబోధించారు. ఈ సందర్భంగా ఇవాంజెలిస్ట్ గోపే సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్యారిస్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది స్త్రీలంతా ఐక్యతతో ఈ స్త్రీల సండే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామం రాష్ట్రం దేశం గురించి ప్రత్యేక ప్రార్థన జరిపారు. మహిళలు ఆలపించిన గీతాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కోనలపల్లి వజ్రం,నేతల శాంత కుమారి, చిల్లా మణికుమారి, పాకెర్ల అమ్మాజీ, వర్ధనపు నాగమణి, మరపట్ల నీలిమ, చిల్లా మార్తమ్మ, కేదాసి చంటమ్మ, చిగురుపాటి జయంతి, బుంగా చలపతి, చిల్లా ఝాన్సీ, కోనలపల్లి సుధారాణి, మరపట్ల చిట్టి పాల్గొన్నారు.

రేపు పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం సాయంత్రం మేంటేవారి తోటలోని, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వి.రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరీశీలన చేసి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 సంవత్సరాల లోపు వయసు ఉన్న చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు.

నేత్ర వైద్య శిబిరం

యలమంచిలి: మేడపాడు గ్రామంలోని గరువు ప్రాంతంలో ఉన్న శెట్టిబలిజ రామాలయం వద్ద ఆదివారం భీమవరం రాధాకృష్ణ నేత్ర వైద్యశాల సిబ్బంది ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది తలనొప్పి, చత్వారం, కళ్ల మసగ, మెడ నరాలు లాగడం వంటి సమస్యలతో బాధపడుతున్న 45 మందికి ఉచితంగా కళ్ల పరీక్షలు నిర్వహించారు. వీరిలో 11 మందికి కంటిలో శుక్లాలు ఉండుటతో శస్త్రచికిత్సకు రిఫర్ చేశారు. మరొక 16 మందికి కళ్లజోళ్లు పడతాయని వివరించారు.

ఇరువర్గాల ఘర్షణపై కేసు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రెండు వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం బేతపూడిలోని కొత్రపాడుకు చెందిన పైడి రాజేష్‌ను అదే గ్రామానికి చెందిన పాలపర్తి ఏలియాస్ మరో నలుగురు కలిపి కర్రలతో కొట్టి గాయపరిచినట్లు పరస్పరం ఒక వర్గంపై మరో వర్గం ఫిర్యాదు చేసుకోవడంతో రూరల్ ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. భీమవరానికి చెందిన కొల్లాటి పెద్దిరాజు రైల్వే డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తుంటాడు. నరసింహపురం నుంచి భీమవరం వైపు వస్తుండగా వెనుకనుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. బాధితుడు కొల్లాటి పెద్దిరాజు ఫిర్యాదు మేరకు ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.